# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha
@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

ఆదివారం 22-7-2023




## మణిపూర్ సీఎంను తొలగించండి

**మణిపూర్, జూలై23(తెలుగుప్రభ):**

మణిపూర్‌లో పరిస్థితులు చక్కబడాలంటే, మారణకాండ ఆగాలంటే రాష్ట్రముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌ను వెంటనే తొలగించి అక్కడ రాష్ట్రపతి పాలన విధించాల్సిందిగా రాజ్యసభసభ్యుడు కపిల్ సిబల్ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కోరారు. నిర్భయ ఘటన తర్వాత సైతం దేశంలో మహిళల భద్రతకు సంబంధించి ఎలాంటి మార్పులేదని వేదన వ్యక్తం చేశారు. హాథ్రస్, కథువా ఉదంతాలు అందుకు నిదర్శనమన్నారు. పరిస్థితులు మారనందుకు ఈ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సూచించారు. ఇప్పటికైనా ఆడబిడ్డలను కాపాడాలన్నారు.




# మణిపూర్ మంటల్లో చలి కాచుకుంటారా?

**న్యూఢిల్లీ, జూలై23 (తెలుగుప్రభ):**

మహిళలంటే మనుషులేనా అని అనుమానం కలిగేలా.. అవసరాన్ని బట్టి మాంసపు ముద్దలు, విరోధులపై ప్రయోగించే ఆయుధాలు అని అనుకునేలా దారుణ మారణకాండలు జరుగుతున్నా.. స్పందించాల్సిన సర్కారు ఇంకా స్పందించలేదు. ఈ అంశంలో నిర్లక్ష్యాన్ని లక్ష గొంతులు ప్రశ్నిస్తున్నా,కోటి గుండెలు రోదిస్తున్నా బాధ్యతాయుత పదవుల్లో ఉన్న వారికి ఏమీ పట్టినట్లు లేదు. విదేశీ పర్యటనలు.. అక్కడి పొగడ్తల కీర్తనల్లో తరించడం అలవాటైన ప్రధానమంత్రికి మణిపూర్ అంటే ఏమాత్రం పట్టింపు ఉన్నట్లు లేదని సామాన్యులు సైతం వేదన వ్యక్తం చేస్తున్నారు. వందేభారత్ రైళ్ల ప్రారంభోత్సవాలకు, ఎన్నికల్లో ఓట్లు తెచ్చిపెడతాయనుకునే కార్యక్రమలకు వివిధ రాష్ట్రాలకు వెళ్లే మోదీకి మండుతున్న మణిపూర్‌కు వెళ్లే తీరిక చిక్కకపోవడాన్ని మేధావులు ప్రశ్నిస్తున్నారు. అది 140 కోట్ల భారతీయులు సిగ్గుపడే ఘటన అని, అవమాన భారంతో తలదించుకునే దుస్థితి అని దుండగులు ఎవరైనా తగిన మూల్యం తప్పదని ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యలు మొక్కుబడి ప్రకటనలే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎవరేం చేసినా తాము చలించేదే లేదన్నట్లుగా కేంద్రమంత్రులు సైతం వ్యవహరిస్తుండటంపై విద్యార్థులు తట్టుకోలేకపోతున్నారు. రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించుకున్న నీరో చక్రవర్తిని గుర్తుకు తెస్తున్నారని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.దానిపై తాను చేసేదేమీ లేదన్నట్లుగా ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి వ్యవహారాల శాఖ చూస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. మణిపూర్ ఈశాన్య రాష్ట్రమేనని మరచిపోయారేమోనని నెటిజెన్లు గుర్తుచేస్తున్నా స్పందన లేదు.జాతులేవన్నది, తెగలేవన్నది పక్కన పెడితే మణిపూర్ రాష్ట్రంలో మహిళల్ని వివస్త్రల్ని చేసి ఈడ్చుకు వెళ్లిన రోజునే మరో ఇద్దరు యువతులపై సామూహిక అత్యాచారం, హత్య జరిగినట్లు జీరో ఎఫ్ఐఆర్ ద్వారా వెల్లడైంది. మహిళలు స్వయంగానే బట్టలు విప్పుకొని రక్షణగా వచ్చిన పోలీసుల్ని తరిమి కొట్టారంటూ మరో వీడియో వైరల్‌గా మారింది.అంటే పరిస్థితులు ఎటు పోతున్నాయో అంచనా వేసుకోవచ్చు. మణిపూర్‌లో ఇలాంటి ఘటనలు వందలు జరుగుతుంటాయని రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ వ్యాఖ్యానించడం వెనుక నిర్లక్ష్యమే కనబడుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎవరేం చెప్పినా, ఏం జరుగుతున్నా ఇంకా మొద్దునిద్ర వీడకపోవడమే సందేహాలకు తావిస్తోంది. ప్రధాన మంత్రి,కేంద్రమంత్రి,ముఖ్యమంత్రి ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత కంటే రాజకీయాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. మణిపూర్‌లో జరిగిన బర్బర క్రీడపై తగిన విధంగా స్పందించాల్సింది పోయి ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాజస్థాన్,పశ్చిమబెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో మహిళలపై అకృత్యాలు జరుగుతున్నా ఎందుకు ప్రశ్నించడం లేదంటూ కొందరు బీజేపీ నేతలు ఎదురుదాడికి దిగడాన్ని సమాజం చూస్తోంది. గుజరాత్‌లో బిల్కిస్‌బానో కుటుంబ సభ్యుల్ని చంపేసి,ఆమెపై సామూహిక అత్యాచారం చేసిన వారికి పడిన శిక్షాకాలం పూర్తి కాక ముందే ఓ స్వాతంత్ర్య దినోత్సవాన సమరయోధులను మించి సత్కారాల మధ్య జైలు నుంచి విడుదల కావడాన్ని ప్రజలింకా మరిచిపోలేదు. మండుతున్న మణిపూర్ మంటలు చల్లారడం లేవు. అయినా వాటిని చలి మంటలుగా కాచుకుంటాం అనుకునేవారికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని, ఢిల్లీలో నిర్భయ ఘటనతో అప్పటి పాలకులకు పట్టిన గతే పట్టక తప్పదని ప్రజలు హెచ్చరిస్తున్నారు.



## హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌గా అలోక్ ఆరాధే ప్రమాణ స్వీకారం..

**హైదరాబాద్, జూలై 23 (తెలుగుప్రభ)**

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అలోక్ అరాధే ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. రాజ్‌భవన్‌లో ఉదయం 11 గంటలకు జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో గవర్నర్ తమిళిసై.. జస్టిస్ అలోక్ ఆరాధేతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు కొలిజియం సిఫారసుల మేరకు రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అలోక్ ఆరాధే నియామకానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌తో సంప్రదింపుల తర్వాత జస్టిస్ ఆలోక్ అరాధేను తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమించారు. ఈ నియమానికి ముందు ఆరాధే కర్ణాటక హైకోర్టులో జడ్జిగా విధులు నిర్వరిస్తున్నారు.



## రష్యాలో వేడినీటి పైపు పగిలి నలుగురి మృతి

**న్యూఢిల్లీ, జూలై 23(తెలుగుప్రభ):**

రష్యాలోని మాస్కోలో ఒక షాపింగ్‌మాల్‌లోవేడినీటి పైపు పగిలిపోవడంతో నలుగురు మృతిచెందడంతో పాటు 70 మంది గాయపడ్డారు. మాస్కో మేయర్ సెర్గీ సొబియానిన్ టాస్ అనే వార్తాసంస్థకు ఈ విషయం తెలిపారు. గాయపడ్డ వారిలో తీవ్ర గాయాలపాలైన 9మందిని ఆస్పత్రిలో చేర్చారు. స్థానిక మీడియా సమాచారం మేరకు, మాల్‌లోని వేడినీటి పైపు పగిలి, మాల్‌లోకి నీరు చేరింది. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన రష్యన్ ఇన్విస్టిగేటివ్ కమిటీ ప్రతినిధి యులియా ఇవనోవా మాట్లాడుతూ, నలుగురు నిందితులపై గ్రూప్ క్రిమిన్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## శుభాకాంక్షలు సార్







## కేరళలో దోషికి ఉరి.. 92 ఏళ్ల జైలుశిక్ష

**తిరువనంతపురం, జూలై23(తెలుగుప్రభ):**



కేరళలోని ఇడుక్కి జిల్లాలో అణాంచల్ సమీపంలోఆరేళ్ల బాలున్ని సుత్తితో కొట్టి చంపి, బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి ఇడుక్కి స్పెషల్ ఫోక్సో కోర్టు ఉరిశిక్షతో పాటు 92ఏళ్ల జైలుశిక్ష, రూ.9.91 లక్షల జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. సునీల్‌కుమార్(44)అనే వ్యక్తి 2021 అక్టోబర్ 2వ తేదీన ఇంటి తలుపులు పగుల గొట్టి లోనికి ప్రవేశించి ఇంట్లో ఉన్న బాలున్ని సుత్తితో కొట్టడంతోపాటుఅతని సోదరిపై అత్యాచారం చేశాడు. అంతటితో ఆగకుండా మరో ఇద్దరు మహళలపై దాడి చేశాడు. విచారణ జరిపిన కోర్టు తాజాగా తీర్పు ఇచ్చింది.

## స్టార్ హీరో సూర్య అభిమానుల మృతి

**గుంటూరు, జూలై 23(తెలుగుప్రభ):**

పల్నాడుజిల్లా నరసరావుపేట మండలం మోపువారి పాలెంలో ఫ్లెక్సీలు కడుతుండగా షాక్ కొట్టి ఇద్దరు విద్యార్థులు మరణించారు. స్టార్ హీరో సూర్యపుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలుతయారు చేయించారు. వాటిని కడుతూ విద్యార్థులిద్దరు నక్కా వెంకటేశ్, పోలూరు సాయి విద్యుత్ షాక్ వల్ల అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.




## జయహో.. రామన్నా..

### బర్త్‌డే స్పెషల్ సాంగ్ ఆవిష్కరించిన తలసాని

**హైదరాబాద్, జూలై 23 (తెలుగుప్రభ)**

పరిశ్రమలు, ఐటీ రంగ అభివృద్ధిలో తెలంగాణ మంత్రి కేటీఆర్ కీలకపాత్ర పోషించారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కేటీఆర్ బర్త్ డే సందర్భంగా కేటీఆర్ బర్త్ డే సందర్భంగా ఎన్‌ఆర్ఐ చాడ సృజన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన జయహో రామన్న సాంగ్ ను తలసాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఆదర్శం కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో కృషి చేస్తున్నారని, లక్షలాది మంది యువతకు ఉపాధికి కల్పిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ లు అనిల్ కుమార్, ప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌ఆర్ఐ బిగాల మహేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

### ఆస్ట్రేలియాలో కేటీఆర్ జన్మదిన వేడుకలు

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్బోర్న్, కాన్బెర్రా, బ్రిస్బేన్, అడిలైడ్ పట్టణాలలో బీఆర్ఎస్ ఆస్ట్రేలియా శాఖ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి కాసర్ల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెల్బోర్న్ లో సాయిరాం ఉప్పు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విశ్వామిత్ర మంత్రిప్రగడ మాట్లాడుతూ.. తెలంగాణ పునర్నిర్మాణంలో, బంగారు తెలంగాణను సాధించే దిశగా బీఆర్ఎస్ ఆస్ట్రేలియా పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సీఎం కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమన్నారు. తెలగాణ అభివృద్ధికి అందరి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా మెల్బోర్న్ లో వినయ్ సన్నీ ఆధ్వర్యంలో పలువురు రక్తదానం చేశారు.